# చకచకా గెడ్డల ఆధునికీకరణ

- మేయర్ చొరవతో ప్రధాన సమస్య పరిష్కారం
- స్థానికుల హర్షం

**ఆరిలోవ:** ఆరిలోవలో గెడ్డల ఆధునికీకరణకు జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరిలోవలో గెడ్డలను ఆధునికీకరించి, అందంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చినా నెరవేర్చలేకపోయారు. అయితే, ఈ ప్రాంతంలో పదకొండో వార్డు కార్పొరేటరే నగర మేయర్ కావడంతో ఆరిలోవ ప్రాంతంలో గెడ్డల ఆధునీకరణపై దృష్టి పెట్టారని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ 10 నుంచి 13 వార్డుల వరకు ఏడు గెడ్డలున్నాయి. ప్రస్తుతం పదకొండో వార్డులో ఉన్న వెడల్పయిన పెద్ద గెడ్డల ఆధునికీకరణ జరుగుతున్నాయి. పదకొండో వార్డులో కంబాలకొండ వెనుక భాగాన్ని ఆనుకొని డ్రైవర్స్ కాలనీ, శ్రీహరినగర్ నుంచి బాలాజీనగర్, గాంధీనగర్ మీదుగా తోటగరువు కూడలి వరకు ప్రధాన గెడ్డతో పాటు పార్వతినగర్ నుంచి శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌ను ఆనుకొని పార్వతినగర్ మీదుగా సూర్యతేజానగర్ వరకు మరో పెద్ద గెడ్డ ఉంది. ఆయా గెడ్డలు వెడల్పు ఎక్కువగా ఉండంతో వాటిని ఆధునికీకరించి ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా తోటగరువు కూడలి నుంచి డ్రైవర్స్ కాలనీ వరకు ఉన్న గెడ్డ పనులు జరుగుతున్నాయి. పార్వతినగర్ గెడ్డ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాన సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పదకొండో వార్డులో తోటగరువు జంక్షన్ (రవీంద్రనగర్‌కు వెళ్లే కూడలి) నుంచి బాలాజీనగర్ మీదుగా డ్రైవర్స్ కాలనీ శ్మశానం వరకు ఉన్న సుమారు కిలోమీటరు పొడవున ఉన్న గెడ్డను ఐదు భాగాలుగా చేసి ఆధునీకరిస్తున్నారు. రూ 5.50 కోట్లతో వీటి పనులు జరిపిస్తున్నారు. పార్వతినగర్‌లో రెండు వైపుల నుంచి ఉన్న గెడ్డ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ గెడ్డ కారణంగా వచ్చే దుర్గంధంతో ఇటీవల అందుబాటులోకి వచ్చిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడేవారు. దీంతో ఈ ఆస్పత్రికి ముందున్న గెడ్డ భాగం ఆధునికీకరణ పనులు త్వరితగతిన జరిపిస్తున్నారు. దీని అడుగు భాగంలో ప్లాట్‌ఫాం వేశారు. ఇరుపక్కలా రక్షణ గోడలు నిర్మించారు. గెడ్డకు ఇరుపక్కలా చదును చేసి పచ్చదనం, అందం కోసం వివిధ రకాల మొక్కలు నాటనున్నారు. దీనికి ఇరుపక్కలా పార్కు తయారు చేయనున్నారు. పార్వతినగర్‌లో రెండు గెడ్డల పనులు ఒకటి రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. వీటిని రూ.90 లక్షల నిధులతో ఆధునికీకరించనున్నారు.


నిర్మాణ పనులు జరుగుతున్న గాంధీనగర్, బాలాజీనగర్ మధ్య గెడ్డ భాగం


పనులు జరుగుతున్న బాలాజీనగర్ నుంచి డ్రైవర్స్‌కాలనీ వైపు గెడ్డ

### రూ.6.4 కోట్లతో పనులు



ఈ ప్రాంతంలో కంబాలకొండను ఆనుకొని వెడల్పయిన గెడ్డలున్నాయి. ఒకప్పుడు వీటికి ఇరుపక్కలా పంటపొలాలుండేవి. వీటి నుంచి వచ్చిన నీరు ఆధారంగా స్థానికులు పంటలు పండించేవారు. పంట పొలాలు పోయి నివాసాలు పెరగడంతో గెడ్డల్లో వర్షం నీటికి బదులు ప్రజల ఇళ్లలో వాడుక నీరు, మురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ నీటి నిల్వ వల్ల వచ్చే దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడకుండా ఈ గెడ్డలను ఆధునీకరిస్తున్నాం. మురుగు నీరు నిల్వ లేకుండా అడుగున కాంక్రీట్‌తో ప్లాట్‌ఫాం నిర్మించి, వీటి అంచులు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ గోడలు నిర్మిస్తున్నాం. పచ్చదనం, అందం కోసం పూల మొక్కలు నాటిస్తాం. ఒకటి రెండు రోజుల్లో పార్వతినగర్ వద్ద రెండు గెడ్డల పనులు ప్రారంభిస్తాం. తోటగరువు కూడలి నుంచి డ్రైవర్స్ కాలనీ వరకు రూ 5.50 కోట్లు, పార్వతినగర్ గెడ్డలను రూ. 90 లక్షలతో ఆధునీకరిస్తున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, నగర మేయర్

# వలంటీర్ల సేవానిరతి అభినందనీయం


పదో వార్డులో వలంటీర్లను సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల


పదమూడో వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న అక్కరమాని

**ఆరిలోవ:** వలంటర్లు ప్రజలకు చక్కటి సేవలు అందిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు శనివారం జీవీఎంసీ 10, 12, 13 వార్డుల్లో సన్మాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా వార్డుల్లో ఉత్తమ వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలకు వలంటీర్ల ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తూ వలంటీర్లు చిత్తశుద్ధి కనబరుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, పదో వార్డు ఇన్‌చార్జి జగ్గుపల్లి అప్పలరాజు, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, పదమూడో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె. మోహనరావు, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు ఒమ్మి శ్రీను, చలం, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, రత్నం, శ్రీను, కెల్ల సత్యనారాయణ, శిరీష, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాద మృతులకు బీజేపీ నాయకుల సంతాపం

**ఎంవీపీకాలనీ:** ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు నగర బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఈ సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. బాధితులకు దేశమంతా మద్దతుగా నిలవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతులకు సంతాపం తెలుపుతూ కొద్దిసేపు మౌనం పాటించారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


మృతులకు సంతాపం తెలుపుతున్న బీజేపీ నాయకులు

## క్లుప్తంగా

### ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


స్వామికి అన్నాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

**ఆరిలోవ:** జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి సంజయ్‌గాంధీకాలనీలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం షిరిడీ సంస్థాన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. సంజయ్‌గాంధీకాలనీ, హనుమంతవాక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు, విశ్రాంత ఐఏఎస్ అధికారిణి ఉదయలక్ష్మి, విశ్రాంత ఐపీఎస్ అధికారి రమణకుమార్, వంశీకృష్ణ తదితరులు స్వామికి అన్నంతో అభిషేకం చేశారు.

### ఆంగ్ల ప్రావీణ్యంపై విద్యార్థులకు శిక్షణ


ఇంగ్లిష్‌పై శిక్షణ అందిస్తున్న దృశ్యం

**ఎంవీపీ కాలనీ:** ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా అధ్యాపకుడు జి.శేఖర్ ఆంగ్ల ప్రావీణ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే ఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. దీంతో పాటు విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెంచుకోవడం సాధ్యమవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసు నమోదుపై ఏసీపీ దర్యాప్తు

**ఆరిలోవ:** ఆరిలోవ ప్రాంతం తోటగరువులో ఆక్రమణను అడ్డుకున్న రూరల్ మండలం రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసి, దుర్భాషలాడిన మొల్లి హేమంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై ఏసీపీ బాబూజీ శనివారం దర్యాప్తు చేపట్టారు. రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో హేమంత్‌పై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీన్ని ఆరిలోవ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విభాగానికి అప్పగించారు. దీంతో ఆ విభాగం ఏసీపీ బాపూజీ శనివారం గొడవ జరిగిన చోటుకు సిబ్బందితో చేరుకుని చుట్టుపక్కల వారిని విచారించినట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు. ఈ దర్యాప్తు అనంతరం తయారు చేసే నివేదిక ప్రకారం హేమంత్‌పై చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

### శ్రీకృష్ణాపురం గురుకులం ప్రిన్సిపాల్‌కు బదిలీ

**ఆరిలోవ:** విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు బదిలీ అయింది. ఆమెకు విజయనగరం జిల్లా వేపాడలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్‌గా బదిలీ జరిగినట్లు గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి శనివారం తెలిపారు. ఈ మేరకు ఇటీవల ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఆమె స్థానంలో ఇంత వరకు ఎవరినీ నియమించలేదన్నారు. ఆమె సోమవారం ఇక్కడ నుంచి రిలీవ్ కానున్నట్లు రూపావతి తెలిపారు.

# మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

**దాబాగార్డెన్స్:** మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం. శ్యాంప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్. కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును కాపాడుకుందాం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు

**సీతమ్మధార :** ప్రాణత్యాగం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును రక్షించుకుందామని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 793వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావి వర్గం అందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాడుతున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తుందని, దానిని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు కొత్తగా తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. అందుకే మనం దేశభక్తితో పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచి పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఎస్.అజయ్‌కుమార్, సూర్యకేశవ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మన్యుసూక్త హోమం


శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**మహారాణిపేట:** మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. హోమంలో భక్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి పూజ వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి సిద్ధిస్తాయన్నారు. శనివారం హోమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాగింది. పూజల అనంతరం స్వామి వారి ప్రసాద వితరణ జరిగింది.

### సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ. 16.9 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న శివజ్యోతి సేవా సంఘం సభ్యులు

**సీతమ్మధార :** ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16 లక్షల 92 వేల 807 రూపాయల నగదుతో పాటు 5.2 గ్రాముల బంగారం, వెండి 165 గ్రాములు విరాళంగా వచ్చింది. అలాగే 31 యుఎస్ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోశన్ వెల్లడించారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులతో పాటు దేవాలయ సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం విశాఖలోని ఎల్లమ్మ ఆలయం ప్రాంతానికి చెందిన బి.రాఘవేంద్ర గౌతమ్ పుష్కర్ అనే దాత రూ.లక్ష విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరఫున దాతకు అన్నదాన భవనంలో సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు.

# కల్యాణం.. కమనీయం


కల్యాణమూర్తులు

**అల్లిపురం :** ముక్కంటి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణానికి భక్తులు పోటెత్తారు. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో గత మూడు రోజులుగా ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని భార్గవశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈవో రమాభాయి దేవాదాయ శాఖ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి ఉత్సవ విగ్రహాల తిరువీధి నిర్వహించారు.

# మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం



బైకు యాత్రికుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న డి.వి.సూర్యారావు, సాహితీవేత్తలు

**సీతంపేట:** గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

# మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ


శిక్షణ పొందిన మత్స్యకారులతో అధికారులు

**మహారాణిపేట :** సముద్రంలో ప్రయాణించే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అంశంపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం కొత్తజాలారిపేట గంగాదేవి ఆలయ ప్రాంగణంలో 50 మంది మత్స్యకారులకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ (ఏఎల్ఎస్ఏ) సర్టిఫికెట్లు అందజేసింది. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న వారికి రోజుకు రూ.300 రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జేడీ విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, సీనియర్ ట్రైనర్ బాలు, కొండలరావు, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు విజయకృష్ణ, మత్స్యశాఖాభివృద్ధి అధికారి డి.మురళి, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు

**తగరపువలస:** బైపాస్‌రోడ్డు లోని తాతా థియేటర్ వెనుక గల శ్రీలక్ష్మి విజయ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో శస్త్ర చికిత్సకు అవసరమైన వారిని అదే రోజు శంకర్ ఫౌండేషన్ ద్వారా వాహనాల్లో నగరానికి తరలించి, తిరిగి ఆస్పత్రి వద్ద వదిలిపెట్టనున్నట్టు వైద్యుడు రామభద్రరాజు తెలిపారు.



# శ్రీహరివాసానికి హరితశోభ

పచ్చని మొక్కలతో ఆహ్లాదకరంగా శ్రీవారి సన్నిధి


శ్రీవారి ఆలయ ప్రాంగణంలో పచ్చదనం


శ్రీవారి పాదాల నుంచి ఆలయం వరకు ఏర్పాటు చేసిన పూల మొక్కలు


రోడ్డుకు ఇరువైపులా కనువిందు చేస్తున్న పచ్చదనం

**కొమ్మాది:** కొండపై నుంచి చూస్తే నీలి రంగులో కనువిందు చేసే సాగరం... కొండపైన కోరికలు నెరవేర్చే వేంకటేశ్వరస్వామి... ఎక్కడ చూసినా కనుచూపు మేర పచ్చని ప్రకృతి, వివిధ వర్ణాల పూల మొక్కలతో అడుగడుగునా ఆధ్యాత్మికం, ఆహ్లాదాన్ని పంచుతూ భక్తులను తన్మయత్వానికి గురిచేస్తోంది రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ). బిజీ జీవితంల మనుషులు మానసిక ప్రశాంతత కోరుతూ ఆహ్లాదకర ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలను ఆశ్రయిస్తుంటారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఆధ్యాత్మికత, ఆహ్లాదం అందించాలనే మహా సంకల్పంతో టీటీడీ ఇక్కడ పచ్చదనానికి పెద్ద పీట వేసింది. ఆలయ ముఖద్వారం నుంచి శ్రీవారి సన్నిధి వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ వర్ణాల పూలకుండీలు, పచ్చని గడ్డి తివాచీలు, పలు రకాల క్రోటన్ మొక్కలు, పూల మొక్కలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని పరిరక్షించేందుకు ఐదుగురు వ్యక్తులను నియమించారు. అటు సాగరుడు, ఇటు పచ్చదనంతో కూడిన ఈ ఆలయానికి వారానికి ఒక్కసారైనా రావాలని భక్తులు కోరుకుంటున్నారు. 1.5 ఎకరాల్లో ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. కొండపైకి వెళ్లే రోడ్డు మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. శిల్పకళా నైపుణ్యం ఉట్టిపడేలా నిర్మించిన ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది.

# సీతారామచంద్రస్వామికి చక్రస్నానం


స్వామి చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్విక్కులు

**దాబాగార్డెన్స్:** కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవభృదోత్సవం, స్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.